

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025 | 5

రావులపాలెంలో ఇద్దరు బాలికల
మిస్సింగ్‌పై కేసు 7

లంచం తీసుకుంటూ
ఏసీబీకి చిక్కిన రాజోలు ఆర్ఐ 7

ఘనంగా గురుపౌర్ణమి


అమలాపురం షిర్డిసాయి స్వర్ణమందిరంలో సాయిబాబా

జిల్లాలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. పలువురు తమ గురువులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా మందిరాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. 8

రైతులకు రూ.188కోట్లు ధాన్యం బకాయిలు విడుదల

అమలాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రబీ ధాన్యం సేకరణకు సంబంధించి రూ.188.87కోట్ల ధాన్యం చెల్లింపులు చేయనున్నట్టు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 రబీ సీజన్‌లో జిల్లాలో 379 రైతుసేవాకేంద్రాల ద్వారా 32,996 రైతులనుంచి రూ.620.98 కోట్ల విలువైన 2.69లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇప్పటికి 23491మంది రైతులఖాతాల్లో రూ.432.11 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామని తెలిపారు. జేసీ టి.నిషాంతి సూచనలతో జిల్లాలో 9505మంది రైతులకు రూ.188.87కోట్ల ధాన్యం బకాయిలను రైతుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు.




ఆర్డీవో మాధవికి పాదపూజ చేస్తున్న విద్యార్థి

అమలాపురంలోని సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో విద్యార్థినితో జేసీ నిషాంతి


మామిడికుదురులో జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

విజయవంతంగా మెగా పీటీఎం 2.0

- జిల్లావ్యాప్తంగా 2150పాఠశాలలు, వందకు పైగా జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ కార్యక్రమం
- మామిడికుదురులో పాల్గొన్న కలెక్టర్, అమలాపురం రూరల్‌లో నిషాంతి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా పీటీఎం 2.0 కార్యక్రమంలో భాగంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు విజయవంతంగా జరిగాయి. జిల్లాలో మొత్తం 2150 ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలతోపాటు వందకు పైగా ఉన్న జూనియర్ కళాశాలల్లో గురువారం ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మీటింగ్‌లు జరిగాయి. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మామిడికుదురు మండలంలోని జూనియర్ కళాశాల, గోకరాజు గణాధిపతి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలతోపాటు అల్లవరం మండలంలోని అక్షర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఏర్పాటైన మెగా పీటీఎం కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ఉన్న సౌకర్యాల కల్పనపై విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి వాటిని పరిశీలించి వారితో కలెక్టర్ మమేకమై ప్రభుత్వం అమలుచేస్తున్న పీటీఎం 2.0 కార్యక్రమం అమలు తీరుపై వారి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అందరూ సమన్వయంతో పాటుపడాలని కలెక్టర్ సూచించారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేసే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడంలో భాగంగా అన్ని పాఠశాలల, కళాశాలల్లో నిర్వహించిన పీటీఎం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జేసీ టి.నిషాంతి అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి, సమనసలో పాల్గొన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు, బండారులంక హైస్కూలులో ఏర్పాటుచేసిన పీటీఎం సభలకు హాజరయ్యారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం సహా పలుచోట్ల జరిగిన పీటీఎం సమావేశాల్లో పాల్గొన్నారు. పి.గన్నవరం జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గన్నవరం, అంబాజీపేట మండలాల్లో జరిగిన పీటీఎంలు, రాజోలు ఎమ్మెల్యే దేవ రాజేంద్రప్రసాద్ రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కపిలేశ్వరపురంలో జరిగిన కార్యక్రమాల్లోను, ఎమ్మెల్యే బండారు కొత్తపేట నియోజకవర్గంలో సమావేశాలకు హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వారి లక్ష్యాలను వివరిస్తూ ప్రసంగాలు చేశారు.


గంటిపెదపూడిలో బూరుగులంక నదీపాయలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

పెరుగుతున్న గోదావరి

- గంటి పెదపూడిలో నదీపాయపై గోదావరి ప్రవాహానికి తెగిన రోడ్డు

అమలాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోదావరి వరద పెరుగుతోంది. కోనసీమలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. దీంతో జిల్లావ్యాప్తంగా ఆర్డీవోల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై పునరావాస కేంద్రాల పరిశీలన, ఏటిగట్ల వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్నారు. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి శివారులో నదీపాయపై వేసిన అడ్డకట్టు గోదావరి ప్రవాహానికి తెగిపోవడంతో నాగుల్లంక గ్రామాలకు పడవలపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గంటి పెదపూడి శివారు గ్రామాలైన బూరుగులంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక గ్రామాలకు ఈ గట్టు తెగడంవల్ల పడవలపైనే రాకపోకలు సాగించాలి. ఆర్డీవో శ్రీకర్, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి వరద సమయంలో పడవలు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయడంతోపాటు లైఫ్ జాకెట్లు ఉపయోగించాల్సిందిగా ఆర్డీవో శ్రీకర్ ఆదేశించారు. గన్నవరం తహశీల్దార్ శ్రీపల్లవితోపాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. వరదలవల్ల సంభవించే ఏ విపత్తులనైనా ఎదుర్కొనేందుకు మండల స్థాయి అధికార యంత్రాంగం సిద్ధం కావాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో వరద విపత్తుపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచడంతోపాటు లంక గ్రామాల ప్రజలను సురక్షితంగా తరలించేందుకు పడవలు, లైఫ్ జాకెట్లు వంటి వాటిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళికతో వరద ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా ముంపు బారిన పడే గ్రామాల్లో సహాయ చర్యలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉండాలని ఆమె ఆదేశించారు. ప్రస్తుత వరద పరిస్థితిపై ఆమె అధికారులతో సమీక్షించారు. కాగా జిల్లా వ్యాప్తంగా ప్రధాన నదుల్లో నీటిమట్టం క్రమగా పెరుగుతుండడంతో అధికార యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.


జి.పెదపూడిలంక వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

జిల్లాలో 64వేల బంగారు కుటుంబాల ఎంపిక

- సూక్ష్మ పరిశీలనకు కలెక్టర్ ఆదేశం
- కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సు
- జిల్లాలో రిలయన్స్ ద్వారా కంప్రెస్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు

అమలాపురం,జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 స్కీమ్ ద్వారా మార్గదర్శులను ఎంపిక చేసి బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, దాతల భాగస్వామ్యంతో ఈ స్కీమ్ అమలు ద్వారా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదరిక నిర్మూలనేలక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా సర్వే నిర్వహించిన 64వేల మంది బంగారు కుటుంబాలను గుర్తించారు. వీరి అర్హతలను మరోసారి సూక్ష్మస్థాయిలో విచారించేందుకు జీఎస్‌డబ్ల్యుఎస్ విభాగం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రకటించిన ప్రభుత్వ షెడ్యూల్‌కు అనుగుణంగా వచ్చేనెల ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాల తుది జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీ4 అమలుతీరుపై అమరావతి నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పీ4 పథకం అమలు విధివిధానాలపై చర్చించారు. సూక్ష్మస్థాయిలో వారి కుటుంబాల అవసరాలను గుర్తించి వారికి దాతల సహాయంతో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యావసతులు, సామాజిక భద్రత, కమ్యూనిటీ సదుపాయాలు, జీవనోపాదులు, ఉద్యోగ కల్పన, ఆర్థిక చేయూత వంటి అంశాలపై నివేదికలు రూపకల్పనచేసి మార్గదర్శకులకు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. పలు అంశాలపై కలెక్టర్‌తో ఆయన సమీక్షించారు. ఈ కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బంగారు కుటుంబాలకు ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జీరో పేదరికం సాధన దిశగా బంగారు కుటుంబాల అవసరాలు తీర్చాల్సిందిగా సూచించారు. జిల్లాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌వారు కంప్రెస్ బయోగ్యాస్ ప్లాంటు నిర్మాణానికి ముందుకు వచ్చారని, ఇందుకు అనువైన చోట్ల గ్రామసభల నిర్వహణ ద్వారా ప్లాంటు ఏర్పాటుపై అభిప్రాయాలు సేకరించాలని కలెక్టర్ కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, అదే స్థాయిలో అన్నిరంగాల్లోను సంతృప్తి స్థాయిలు మెరుగుపరచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, జ్వరపీడితుల కేసులపట్ల అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల తీవ్రతను పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత వైద్యశాఖ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర, ఆర్థిక గణాంకాధికారి మురళీకృష్ణ, సాంఘిక సంక్షేమశాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, డీపీవో శాంతలక్ష్మి, డీఎల్డీవో రాజేశ్వరరావు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

అంబాజీపేట మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం



చైర్మన్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు

అంబాజీపేట, జూలై10(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, చైర్మన్‌గా అయినవిల్లి మండలానికి టీడీపీ నాయకులు చెందిన చిట్టూరి శ్రీనివాస్, వైస్‌చైర్మన్‌గా అంబాజీపేటకు చెందిన జనసేన నాయకుడు కొర్లపాటి వెంకటేశ్వరరావు, సభ్యులుగా అడబాల సూర్యావతి, అంబటి గంగాభవాని, కముజు నాగసత్య, కోసూరి పోసమ్మ, మట్టపర్తి సోమేశ్వరరావు, మేడిశెట్టి మంగతాయారు, మోర్త వీరవెంకట సత్యనారాయణ, నేదునూరి కుమారి, సలాది ప్రసాద్, గంధం వెంకటేశ్వరరావు, వక్కపట్ల ఆదిలక్ష్మి, దుర్గా శ్రీనివాసరావు, కుడుపూడి సత్యవేణి, అయినవిల్లి మండలం మాగం సొసైటీ చైర్మన్, పి.గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, సర్పంచ్ మాచవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ ఆఫ్కో ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్‌ను ఉత్తర్వులు జారీ చేశారు. పాలకవర్గం నియామకంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రైతుల పంట పండేనా?

- శంకరగుప్తం డ్రెయిన్ వద్ద ముంపునీటి ఎత్తిపోతలకు ప్రతిపాదనలు


ముంపునీరు సముద్రంలోకి వెళ్లడానికి తవ్విన డ్రెయిన్

మలికిపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్ వద్ద ముంపునీటిని చింతలమోరి-కేశవదాసుపాలెం మధ్యనుంచి బయటకు పంపేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఎత్తిపోతలు పూర్తయితే రాజోలు నియోజకవర్గంలో మరిన్ని ఎకరాల్లో పంట సాగు అందుబాటులోకి వస్తుంది. నియోజకవర్గంలో 14వేల ఎకరాల రిజిస్టర్ ఆయకట్టు ఉండగా ముంపు నీరు వెళ్లే మార్గం లేక 3వేల ఎకరాల్లో మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. వర్షం, వరదలు తదితర ముంపు నీటిని గతంలో డ్రెయిన్ల ద్వారా శంకరగుప్తం డ్రెయిన్‌లోకి వెళ్లేవి. శంకరగుప్తం డ్రెయిన్ ఎగదన్నడంతో ముంపునీరు చేల నుంచి దిగకపోవడంతో రైతులు సార్వా పంటకు క్రాప్ హాలీడే ప్రకటించారు. దాళ్వా పంటకు వచ్చేసరికి అనుకున్న స్థాయిలో వరినాట్లు వేయడం లేదు. దీంతో రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ 10వేల ఎకరాలకు వ్యవసాయాన్ని పెంచాలనే తలంపుతో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణలను చాలావరకు తొలగించారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ కూడా కొంతమేర డ్రెడ్జింగ్ కాగా మిగిలిన ప్రాంతం రూ.9కోట్లతో డ్రెడ్జింగ్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఆర్థికశాఖ వద్ద ఆగినట్టు తెలిసింది. అయినా చేలల్లోని ముంపునీరు మోటార్ల ద్వారా శంకరగుప్తం డ్రెయిన్‌లోకి తోడి ఆ నీటిని చింతలమోరి-కేశవదాసుపాలెం మధ్యనున్న స్ట్రయిట్ కట్ ద్వారా సముద్రంలోకి పంపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం ఇరిగేషన్, డ్రైన్స్ ఏపీఐడీసీ అధికారులను తీసుకువచ్చి ఎమ్మెల్యే దేవ పరిశీలన చేయించారు. ఏపీఐడీసీ ద్వారా ముంపు నీటిని ఎత్తిపోయడానికి భారీ బడ్జెట్ అవుతుండడంతో డ్రైనేజీ విభాగం ద్వారా ఉప్పలగుప్తం మండలం రామేశ్వరం మొగ నుంచి ముంపు నీటిని పంపేలా చింతలమోరి-కేశవదాసుపాలెం మధ్య ముంపునీటిని పంపే ఏర్పాట్లకు డ్రైనేజీ శాఖతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. 45రోజుల పాటు 10 మోటార్ల ద్వారా ఈ ముంపు నీటిని డ్రెయిన్‌లోకి మళ్లిస్తే లక్ష్యం నెరవేరుతుంది. బీడు బారిన భూములకు కళ వస్తుంది. ఎమ్మెల్యే ప్రయత్నం సాకారం కావాలని నియోజకవర్గంలోని రైతులు కోరుతున్నారు. ప్రతిఏటా 45రోజులపాటు మోటర్ల ద్వారా ముంపు నీటిని డ్రెయిన్‌లోకి తోడడానికి సీఎస్సార్ నిధులు మంజూరు చేయమని కలెక్టర్‌ను కోరామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు.



గోదారి.. వయా..గ్రా!

ఎక్కడపడితే అక్కడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1500 వరకూ మెడికల్ షాపులు ఉన్నాయి. వాటిలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం నగరాల్లో 500 ఉండగా.. గ్రామాలు, మండల కేంద్రాల్లో వెయ్యి వరకూ ఉంటాయి. చాలా దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే అన్ని మం దులనూ అమ్మేస్తుంటారు.నిద్ర మాత్రలు, యాం టి బయోటిక్స్ ఇలా అన్నీ దొరికేస్తుం టాయి. గ్రామాల్లో ఈ విధమైన వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. ఇదే అదనపుగా ఒక యువకుడు వయాగ్రా, అబార్షన్ కిట్లు, అబార్షన్ ట్యాబెట్ల వ్యాపారాన్ని తెరచాటుగా విస్తరించుకున్నాడు. గ్రామాల్లో అబార్షన్ కిట్లు విచ్చలవిడిగా దొరుకుతుండ డంతో ఎలాంటి అనుమతులు, అనుభవం లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు.

విచ్చలవిడిగా మందుల విక్రయాలు

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా ఓకే
- అందుబాటులో అబార్షన్ ట్యాబ్లెట్లు
- ఇబ్బడిముబ్బడిగా వయాగ్రా అమ్మకాలు
- దగ్గు మందులకు అడ్డే లేదు
- కొరవడిన డ్రగ్స్ శాఖ నిఘా
- మామ్మూళ్ల మత్తే కారణం

మెడికల్ షాపులకు వెళ్లి ఏ మందు అడిగినా లేదనే సమాధానం రాదు..నిన్నటి వరకూ జ్వరం, దగ్గు, జలుబు మందులే అనుకుంటే.. ఇటీవల ఒక యువకుడు పట్టుబడడంతో అసలు విషయం బయటపడింది.. వయాగ్రా, అబార్షన్ మాత్రలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్టు తెలియడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నివ్వెరపోయింది.. డ్రగ్స్ శాఖ మామూళ్ల మత్తులో జోగుతుండడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి నిఘా పెట్టగా అన్ని మెడికల్ షాపుల్లోనూ ఈ తంతు నడుస్తున్నట్టు తెలుస్తోంది..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రగ్స్ శాఖ మత్తు బిళ్లలు వేసుకోవడంతో మెడికల్ షాపుల వ్యాపారం జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. అధిక శాతం మెడికల్ షాపుల్లో అడిగిందే తడవుగా విచ్చలవిడిగా మందులను విక్రయిస్తున్నారు. ఎంతలా అంటే.. వైద్యుడి చీటీ లేకుండా షెడ్యూల్ హెచ్ మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదు. కానీ అవేమీ పెద్దగా పట్టింపు లేకుండా వ్యాపారాలు నడిచిపోతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖ (డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్) శాఖలోని పలువురు అధికారులు పలుకుబడి అనే మందు వాడుతుండడంతో గోదావరి జిల్లాల్లో వాడ వాడలా వయాగ్రా దొరుకుతున్నా చలనం లేదు.

చూసీచూడనట్టు..

ఉమ్మడి జిల్లా పరిధిలో రాజమండ్రి అర్బన్, రూరల్, కొవ్వూరు, తుని, కాకినాడ రూరల్, అర్బన్, అమలాపురంలలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరికి జిల్లా అధికారిగా ఏడీ ఉంటారు.

అసలేంటి వయాగ్రా?

వయాగ్రా అనేది తయారీ కంపెనీ పేరు. ఆ మాత్రల్లో 'సిల్డినాఫిల్ సిట్రేట్' అనే మెడిసిన్ ఉంటుంది. అన్ని మందుల మాదిరిగానే దీనినీ మెడికల్ షాపుల్లో విక్రయించవచ్చు. కానీ వైద్యుల ప్రిస్క్రిప్షన్, పర్యవేక్షణ కచ్చితంగా ఉం డాలి. ఈ మెడిసిన్‌ని లైంగిక పటుత్వం, కలయిక సమయం పెరుగుదలకు వాడతారు. పల్మనరీ హైపర్ టెన్షన్‌కి ఒక్కోసారి వైద్యులు సూచిస్తారు. బీపీ ఉన్న వారు ఈ మెడిసిన్ వాడితే నరాలు పగిలిపోయి ప్రాణాపాయానికి దారి తీస్తుంది. ఈ ట్యాబ్లెట్లు 4.50 సంఖ్యా ప్యాక్‌లో దొరుకుతాయి. వీటిని ఆన్‌లైన్‌లో కూడా విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు.వీటికి ఉమ్మడి జిల్లాలో యువత అలవాటు పడడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది.రాజమండ్రిలో 2017-18లో వయాగ్రాకు సంబంధించి కేసులు పెట్టారు. అవి ఇప్పటికీ నడుస్తున్నాయి.కొన్ని నెలల కిందట దానవాయి పేటలోని ఓ పెద్ద మెడికల్ షాపులో కాలం చెల్లిన మందులు విక్రయించగా ఓ వారం రోజుల పాటు ఆ షాపును మూతవేయించారు. తర్వాత 'ఏ జరిగిందో' ఎవరికీ తెలియదు. ఏదేమైనా చాలామటుకు దుకాణం స్థాయిలోనే సర్దు బాటు అయిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ సీరియస్‌గా దృష్టి సారించాలనే వాదన వినవస్తోంది.

వయాగ్రా అంశం గుప్పుమన్న తర్వాత పొడిపొడిగా తనిఖీలు చేశారు. కానీ ఏం జరిగిందో తెలియరాలేదు.దీనిపై ఉమ్మడి తూర్పు గోదావరి ఔషధ నియంత్రణ శాఖ ఏడీని వివరణ కోరడానికి రెండు రోజులపాటు ప్రయత్నించినా ఫోనులో అందుబాటులోకి రాలేదు. మెడికల్ షాపుల ద్వారా కొంత మొత్తం ముడు తుండడంతో కొందరు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మందుల విచ్చలవిడి విక్రయాలపై గత ఏడాది అక్టోబరులో 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా హెచ్చరించింది. మందుల విక్రయాలు ఇష్టానుసారం జరుగుతున్నాయని, వైద్యులు కూడా అనవసరమైన మందులను యథాలాపంగా రాసేస్తున్నారని పేర్కొంది.

మందుల తీరు మాయ

గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్స్‌ని నియమించుకుని వ్యాపారం చేసేవి.అయితే ఇప్పుడు కొత్త ఒరవడి వచ్చింది. హరియాణాలోని బద్దీ అనే ఓ ప్రాంతంలో, అలాగే గుజరాత్‌లోని పలు చోట్ల మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. మెడికల్ రిప్రజెంటేటివ్‌లుగా అనుభవం వచ్చిన తర్వాత కొందరు డాక్టర్ల వద్ద ఆర్డర్లు తీసుకొని సొంతంగా ఆ ప్రాంతాలకు వెళ్లి పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసి తీసుకు రావడం మొదలైంది.దీనిని ప్రొపగాండా కం డిస్ట్రిబ్యూషన్ (పీసీడీ) అంటారు. ఆ మందులపై సొంతగా పేరు వేయించుకోవచ్చు. సాధారణంగా మందులు తయారీ నుంచి వినియోగదారుడి చేతికొచ్చేసరికి 1500 శాతం ధర పెరు గుతుంది. ఇప్పుడు వయాగ్రా, అబార్షన్ కిట్లను తీసుకొచ్చి దందా సాగిస్తున్నారని తెలుస్తోంది.

నాడు కలెక్టర్ ఆదేశించినా..

ఉమ్మడి తూర్పులోని డ్రగ్స్ శాఖ పనితీరుకు దగ్గు మందుల అంశం మరో ఉదాహరణ. గంజాయి వంటివి కట్టడి చేసినా యువత మత్తులో జోగుతుండడంపై తూర్పు గోదావరి పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే నిఘా పెట్టగా..దగ్గు మందులను ఎక్కువ మోతాదులో తాగేస్తున్నారని తెలిసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా లభ్యమవుతుండడంపై నివ్వెరపోయారు. మెడికల్ షాపులపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.కానీ తర్వాత ఫలితం ఏమిటో డ్రగ్స్ అధికారులు బయటకు పొక్కనీయలేదు.

డొంక కదిలిందిలా..

గణేశ్ కుమార్ అనే యువకుడు రాజమహేంద్రవరంలోని ఓ పెద్ద కంపెనీ ఫార్మసీలో కొన్నాళ్లు పనిచేశాడు. ఇదిలా ఉండగా వేరే రాష్ట్రానికి చెందిన వారితో పరిచయం ఏర్పడింది. కొన్ని ఫార్మసీ కంపెనీలు షెడ్యూల్ హెచ్ డ్రగ్స్‌ని అక్రమంగా పెద్ద మొత్తంలో అమ్ముకోడానికి ఉద్యోగులను నియమించుకుంటాయి. ఈ మా దిరిగానే గణేశ్‌కి మార్గం దొరింది. దీంతో అతడు వ్యాపారాన్ని విస్తరించుకున్నాడు. కొన్నేళ్లుగా వయాగ్రా ట్యాబ్లెట్లు, గర్భవిచ్ఛిత్తి మందులు, కిట్లు తెచ్చి మెడికల్ షాపులకు విక్రయిస్తున్నా డు. జంగారెడ్డిగూడెంలోని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ఎత్తున ఆ మందులు పట్టుబట్టాయి. అయితే ఉమ్మడి తూర్పుగోదావరిలో కూడా ఆ అక్రమ వ్యాపారం విక్రయించిందని చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకూ డ్రగ్స్ అధికారులు మేలుకోలేదు.


తాళ్లరేవులో తల్లుల పాదాలకు మొక్కుతున్న పిల్లలు


అమలాపురంలో తల్లుల దీవెనలు తీసుకుంటున్న పిల్లలు


రాజమహేంద్రవరంలో కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు


సర్పవరంలో తల్లుల పాదాలు కడుగుతున్న విద్యార్థులు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు


అమ్మా నీకే: పిఠాపురంలో తల్లులకు మొక్కలు అందజేత


ఆలమూరులో మెగా పీటీఎం ఆకారంలో విద్యార్థులు


నా అంత ఎదగాలి : గోపాలపురం రాజంపాలెంలో కలెక్టర్ ప్రశాంతితో నడచి వస్తున్న విద్యార్థి

మెగా పండుగ

పాఠశాలల్లో ఉత్సాహంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

విద్యాలయాలు పండుగ వాతావరణంతో కళకళలాడాయి. పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు ఆహ్లాదకర రీతిలో జరిగాయి. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని పాఠశాలల్లో వినూత్నంగా పీటీఎం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోను తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను మెగా ప్రగతిలో భాగస్వాములను చేశారు. కొన్ని చోట్ల విద్యార్థులు తమ తల్లులకు కాళ్లు కడిగి ప్రేమ చాటుకున్నారు. అమ్మ పేరున మొక్కనాటాలన్న ఆదేశాలతో పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి మొక్కలు అందజేశారు.



పి.గన్నవరంలో తల్లితో విద్యార్థినుల ఫొటో



రాజమహేంద్రవరం, కరపలో టగ్ ఆఫ్ వార్ నిర్వహిస్తున్న దృశ్యం


రాజమండ్రి సెల్ఫీ స్టాండ్ వద్ద డీఎల్ఎస్ సెక్రటరీ శ్రీలక్ష్మికి స్వాగతం

శాకంబరిగా రత్నగిరి దుర్గలు


శాకంబరిగా దర్శనమిస్తున్న వనదుర్గమ్మ


మరిడమ్మ అమ్మవారికి మహిళలు సమర్పించిన సారె

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గ, గ్రామదేవతలు నేరేళ్లమ్మ, మరిడమ్మ, వాసవీమాతలు శాకాంబరీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. ఈసందర్భంగా అమ్మవార్లను వివిధ రకాలైన కూరగాయలతో అలంకరించారు. శాకాంబరీ అలంకారంలో ఉన్న అమ్మవార్లను భక్తులు, గ్రామస్థులు దర్శించుకున్నారు.

మరిడమ్మ అమ్మవారికి సారె సమర్పణ

గ్రామదేవతగా పూజలందుకుంటున్న మరిడమ్మ అమ్మవారికి గురువారం గ్రామంలో వెలంపేట మహిళలు సారెను సమర్పించారు. వివిధ రకాలైన పదార్థాలు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, కలశాలతో జలాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో అందజేశారు. అనంతరం వీటిని ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయకమిటీ సభ్యులు పెద్దింటి లక్ష్మణ్, యాళ్ల శ్రీనివాస్, వర్రే సత్యకుమార్ ఏర్పాట్లు చేశారు.

లోవలో ఆషాఢ మాసోత్సవాలు

తునిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాడ మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన హోమ క్రతువుల్లో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలాచరించారు. పెద్దాపురం నాదస్వర విద్వాంసులు వారిచే నిర్వహించిన నాదస్వర సంగీత కచేరి భక్తులను అలరించింది. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు పండితులు వేద ఆశీర్వచనాలు గావించారు.

శాకంబరిగా ఆలమూరు రావులమ్మ

58 రకాలు.. 550 కిలోల కూరగాయలతో అలంకరణ



ఆలమూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఆలమూరు గ్రామదేవత రావులమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి అమ్మవారిని దర్శించుకున్నారు. రావులమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించడానికి భక్తులు సహకారంతో 58 రకాల కూరగాయలు 550 కిలోలతోపాటు వివిధ రకాల ఆకుకూరలతో అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. శాకాంబరి అమ్మవారిగా రావులమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు వేదుల లక్ష్మణశర్మ అధ్వర్యంలో పెద్దింటి కాశీవిశ్వనాథ శర్మశాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

నూకాంబిక ఆలయానికి రూ.5.5 లక్షల విరాళం

చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు మండపేటకు చెందిన టీడీపీ నాయకులు వంక సాయికుమార్‌బాబు భారీ విరాళం అందించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గుర్తించి రూ.5.5లక్షల విరాళంను ఆలయకమిటీకి అందించారు. దాత సాయికుమార్‌బాబును అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు అల్లంరాజు రామకృష్ణమూర్తి, గన్ని వెంకట్రావు, వైట్ల శేషబాబు, గన్ని సూరిబాబు, వైట్ల గంగరాజు, బొబ్బా ఏసు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గురుపౌర్ణమి.. వేడుకలు


బలభద్రపురంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా, దర్శనానికి బారులుదీరిన భక్తులు

బలభద్రపురంలో సాయిబాబాకు 1008 లీటర్ల ఆవుపాలతో అభిషేకం

బిక్కవోలు, జూలై 10(ఆంధ్రజజ్యోతి): బలభద్రపురంలోని సాయిమందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి బాబా దర్శనానికి భక్తులు బారులు తీరారు. కాకడ హారతితో వేడుకలు ప్రారంభించారు. అనంతరం సాయిబాబాకు 1008 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, శ్రీచక్రానికి లక్ష కుంకుమార్చన, దత్తాత్రేయ హోమం, చండీ మూలమంత్రం, సూర్యనమస్కారాలు, సహస్ర లింగార్చన, సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాబాకు క్షీరాభిషేకం జరిపి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. భక్తులకు బిరియాని ప్రసాదాన్ని అందించామని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు.మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బాబాను దర్శించుకుని పూజలు చేశారు.కార్యక్రమాల్లో కొవ్వూరి పాపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయదుర్గా పీఠంలో గాడ్ ఆశీస్సులు పొందుతున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి

సత్యదేవుడి సన్నిధిలో గురువందనం

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా గురువందనం కార్యక్రమం టీటీడీ సహకారంతో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ అనంతతీర్థాచార్యులు ఆయన శిష్యబృందం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువుల వద్ద నేర్చుకున్న విద్యను సమాజానికి ఉపయోగపడేలా వ్యవహరించినప్పుడే జ్ఞాన సముపార్జనకు సార్థకత చేకూరుతుందన్నారు.ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో నడవాలని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో గురుపూజోత్సవం

రాయవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాకలోని విజయదుర్గా పీఠంలో బీజేపీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వేర్వేరుగా పీఠాన్ని దర్శించుకున్నారు. గాడ్‌కు ఎమ్మెల్యే పుష్పాలతో పాదపూజ చేయగా ఎంపీ సత్కరించారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యే విజయదుర్గమ్మను దర్శించుకున్నారు. అర్చనలు, హారతులు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పీఠాన్ని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యేను పీఠం ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు సత్కరించారు. కార్యక్రమల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కర్రి చిట్టిబాబు, కోన సత్యనారాయణ, చాట్రాతి జానకి, ఎం.శ్రీదేవి, శాకా దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి 3 కిలోల వెండి ఆభరణాలు

ద్రాక్షారామ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి రామచంద్రపురం మండలం హసన్‌బాద మాజీ సర్పంచ్ పచ్చిపాల వీరవెంకట్రావు, వెంకటలక్ష్మీ దంపతులు రూ 3.70 లక్షలు విలువైన 3 కేజీల వెండి ఆభరణాలు బహూకరించారు. వెండి కవచం, కిరీటం తదితర ఆభరణాలు ఆలయ అర్చకులకు అందచేశారు.

మధ్యవర్తిత్వంతో శాంతియుత పరిష్కారం

పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంలో శాంతియుత పరిష్కారానికి అవకాశం ఉంటుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం దిశగా 86 మంది న్యాయవాదులకు 40గంటలపాటు తమిళనాడు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమ ప్రారంభించిన ఆమె.. 'దేశం కోసం మధ్యవర్తిత్వం' వారోత్సవాల పోస్టర్‌ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయ సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా ప్రజలు తమ వివాదాలను శాంతియుతంగా, తక్కువ ఖర్చుతో, త్వరగా పరిష్కరించుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ సమస్యలకు మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వక పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ఇరు పక్షాల నుంచి సామరస్య అంగీకారం తీసుకొని ఆ మేరకు అవార్డు(తీర్పు) జారీ చేయనున్నట్టు చెప్పారు. రాజీ అంటే ఇరు పక్షాలదీ గెలుపేనని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పీఎల్వీలు తదితరులు పాల్గొన్నారు.

సేవ్ మల్లయ్యపేట


మల్లయ్యపేట పేపరుమిల్లు రోడ్డులో కమ్మేసిన దుమ్ము ధూళి

దుమ్ము, ధూళి నుంచి రక్షించండి
ఫ్లెక్సీలతో గ్రామస్థుల వినూత్న నిరసన

రాజమహేంద్రవరం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కాలుష్యం నుంచి మల్లయ్యపేటను రక్షించాలని కోరుతూ గ్రామస్థులు వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. కాతేరు గ్రామ పరిధిలోని మల్లయ్యపేటలో పేపరుమిల్లు నార్గ్‌గేట్ వైపు నుంచి వస్తున్న ఇసుక లారీలు, మిల్లుకు వచ్చేలారీలతో రోడ్డు మొత్తం దుమ్ముధూళితో నిండిపోయింది. దీంతో వర్షపడినప్పుడు బురదమయమై ద్విచక్ర వాహనాలు జారి పడి ప్రజలు గాయాపాలవుతున్నారు. ఎండ కాసినప్పుడు దుమ్ము మొత్తం గాలిలోకి లేచి రోడ్డు పక్కన ఇళ్లున్న వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఆహార పదార్థాలపై కూడా దుమ్ముపడి తినడానికి పనికి రాకుండా పోతుందని, అలాగే రోడ్డుపక్కన చిరు వ్యాపారులు తయారు చేసే ఆహార పదార్థాలపై పడి వాటిని విక్రయించే పరిస్థితి లేక పోతుందని వాపోతున్నారు. షాపుల నిండా దుమ్ము చేరడంతో పరిస్థితి దారుణంగా మారిపోయింది. దీనిపై పంచాయతీ అధికారులకు, పేపరు మిల్లు యాజమాన్యానికి చెప్పి చెప్పి విసుగు చెందిన గ్రామస్థులు వారి ఇళ్ల, షాపుల ముందు 'సేవ్ మల్లయ్యపేట అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. గురువారం సాయంత్రం మల్లయ్యపేటలో రోడ్డుపై నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పేపరుమిల్లు నార్గ్ గేట్ రోడ్డు చాలా దారుణంగా మారిపోయిందని, ఆ రోడ్డులో వచ్చే ఇసుక లారీలతో మట్టి వస్తుందని దీనికి ఇసుక తోడై మల్లయ్యపేట రోడ్డు పైకి చేరి మెయిన్ రోడ్డు కాస్తా మట్టి రోడ్డులా మారిపోయిందన్నారు. విజయవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, స్థానికంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థల బస్సులు, పేపరు మిల్లుకు వచ్చే కర్రల లోడు లారీలు, ఇసుక లారీలతో రోడ్డు దారుణంగా మారిపోయిందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ దుమ్ము ధూళి నుంచి బయటక పడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధూళి వల్ల కళ్లు మంటలు, ఊపిరి పీల్చడంతో లోపల మట్టి పట్టి ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.


ముఖానికి మాస్క్ ధరించి ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు



షాపుల వద్ద 'సేవ మల్లయ్యపేట' ఫ్లెక్సీలు పెట్టిన వ్యాపారస్తులు

రామాలయం పునః నిర్మాణానికి ఒప్పందం

బీజేపీ ధార్మిక సెల్ తెలంగాణ స్టేట్ కన్వీనర్, సినీ నటి కరాటే కళ్యాణి


షాపు యజమానితో మాట్లాడుతున్న కళ్యాణి

సీతానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని స్వీట్ స్టాల్ నిర్వాహకులతో రామాలయ పునః నిర్మాణానికి ఒప్పందం జరిగిందని శ్రీ ఆదిబట్ల కళా పీఠ వ్యవస్థాపక అధ్యక్షురాలు, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ మహిళా అధ్యక్షురా లు, బీజేపీ ధార్మిక సెల్ తెలంగాణ స్టేట్ కన్వీనర్, సినీ నటి కరాటే కళ్యాణి తెలిపారు. గురువారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని రామాలయాన్ని స్వీట్ స్టాల్‌ను కళా పీఠం జిల్లా అధ్యక్షురాలు పోతుల సుబ్బలక్ష్మి సందర్శించారు. రామాలయం మండపం కూల్చి స్వీట్‌స్టాల్ పెట్టారని, షాపు యజమాని క్రిస్టియన్ అని ఫిర్యాదులు రావడంతో కరాటే కళ్యాణి పరిశీలించడానికి వచ్చారు. రామాలయం నిర్వాహకులను పిలిచి ఆరా తీశారు. పూర్వకాలం నుంచి ఆలయ నిర్వహణ తామే చూస్తున్నామని, మూడేళ్ల క్రితం మండపం కూలిపోయే దశకు చేరుకోవడంతో దానిని కూల్చివేశామని తెలిపారు. గుడి ఎక్కడ కట్టినా ఆర్థిక సహాయం చేస్తామని చెప్పడంతో ఖాళీగా ఉన్న మండపం స్థానంలో స్వీట్‌స్టాల్ కట్టుకోవడానికి సరే ఒప్పుకున్నామన్నారు. కళ్యాణి సమక్షంలో రెడ్డి కుటుంబానికి హిందూ ధర్మం స్వీకరింపజేశారు. (ఘర్‌వాపసి) ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆలయం కట్టే సమయంలో రాతి విగ్రహాలు ఏర్పాటుచేసి, ఆలయ నిర్మాణానికి షాపు యజమాని ఒప్పుకోవడంతో స్వీట్‌స్టాల్ ఉంచడానికి అనుమతి ఇచ్చామన్నా రు. ఆరు నెలల్లో ఆలయ నిర్మాణం జరగాలన్నా రు. కాగా జనసేన వీరమహిళ సూర్యావతి మాట్లాడుతూ ఆలయ నిర్వాహకులకు గుడిలో జరిగే కార్యక్రమాలపైనే అజమాయిషీ గాని గుడిని అమ్ముకోవడానికి గాని గుడిని కూలగొట్టడానికి గాని అధికారం లేదన్నారు. దీనిపై పోరాటం చేసి ఆలయాన్ని పరిరక్షిస్తామని ఆమె అన్నారు.



పురస్కారం అందుకుంటున్న సుగుణారెడ్డి

ఆదిత్య డైరెక్టర్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం

కాకినాడ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్, రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా వైస్‌ఛైర్మన్ డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా రెడ్‌క్రాస్ పురస్కారాన్ని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. 2022, 23, 24 సంవత్సరాలకు గానూ ప్రథమస్థానం పురస్కారాన్ని గవర్నర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ రెడ్‌క్రాస్‌ను ప్రథమ స్థానంలో నిలిపినందుకు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. సుగుణారెడ్డిని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

రహదారిని ముంచేసిన వరద!

● కోనసీమను తాకిన గోదావరి నీరు
● గంటిపెదపూడి బూరుగులంకలో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
● నాలుగు లంక గ్రామాలకు నిలిచిన రాకపోకలు
● ఇంజన్ పడవలపై ప్రయాణాలు


గంటిపెదపూడి శివారు బూరుగులంక వద్ద పడవలో వెళ్తున్న లంక గ్రామస్తులు


గంటిపెదపూడిలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారి

పి.గన్నవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎగువన వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాలకు గోదావరికి వరద నీరు ప్రవాహం నెమ్మదిగా పెరుగుతుంది. ఈ క్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడి, ఉడిమూడికి చెందిన నాలుగు లంకగ్రామాల ప్రజానీకం రాకపోకలు సాగించేందుకు బూరుగు లంక నదీపాయలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి గురువారం తెల్లవారుజామున వరద నీటిలో కొట్టుకుపోయింది. వరదనీరు గట్టును తాకిన అరగంటలోనే గట్టు వరద ప్రవాహంలో పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గంటిపెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఊడి మూడిలంక గ్రామాల ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఇంజన్ పడవలపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు దగ్గర నుంచి వ్యవసాయ ఉత్పత్తులు తరలించే రైతులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి లంక గ్రామాల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక గ్రామస్తులు వైవిపాలెం, బెల్లంపూడి వద్ద నదీపాయల్లోకి వరద నీరు రావడంతో ఆ గ్రామాల ప్రజలు నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.


అయినవిల్లి: ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో రహదారికి గండి పడడంతో ఆగిపోయిన ప్రయాణికులు

రహదారికి గండి

అయినవిల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరద తాకిడితో కోనసీమ జిల్లా ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో తాత్కాలిక రహదారి గండి పడింది. కార్లు, ఆటోల ప్రయాణాలు నిలిచిపోయాయి.

లైఫ్‌జాకెట్లు ధరించడం తప్పనిసరి : ఆర్డీవో

లంకగ్రామస్తులు నదీపాయ దాటే సమయంలో తప్పనిసరిగా లైఫ్‌జాకెట్లు ధరించాలని ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. లైఫ్‌జాకెట్లు ధరించనివారిని దాటించవద్దని హెచ్చరించారు. పడవపై పదిమందిని మాత్రమే దాటించాలన్నారు. ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. ప్రస్తుతం 2 ఇంజన్ పడవలు తిరుగుతున్నాయని, వాటిలో లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేశామన్నారు. లంక గ్రామాల నుంచి సుమారు 40 మంది విద్యార్థుల వరకు బయట పాఠశాలల్లో చదువుకుంటున్నారని రోజూ పడవలు దాటే వారికి ప్రత్యేక లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేశామన్నారు. నదీపాయకు ఇరువైపులా రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ టీ.సాయినాథ్ జయచంద్ర గాంధీ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి నాలుగు లంక గ్రామాల్లో పర్యటించారు.

'ముంపు' టెన్షన్

» భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతోన్న గోదావరి
» లోతట్టు ప్రాంతాల ప్రజల్లో ఆందోళన ప్రారంభం
» వలస పాకల ఏర్పాట్లలో నిమగ్నం

చింతూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరదల కాలం వచ్చింది. దీంతో ముంపు ప్రాంతాల్లో టెన్షన్ ప్రారంభమైంది. నదీపరి వాహక ప్రాంతంలో ఎడ తెరిపి లేని వర్షం కురవగా అక్కడి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవడం సహజం. ఐతే విలీన మండలాల పరిస్థితి అందుకు భిన్నం. మన రాష్ట్రంతో పాటు ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినా, వరదలు సంభవించినా ఆ ప్రభావం ఇక్కడ పడుతుంది. ఇది ప్రతి ఏటా జరిగే తంతే. వీటికి తోడు ఇప్పుడు పోలవరం బ్యాక్ వాటర్ తోడైంది. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు లోతట్టు వాసులకు కంటిమీద కునుకు కరువే. శబరి, సీలేరు, గోదావరి నదుల ఉధృతే దీనంతటకీ కారణం. ప్రతి ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఇది తప్పని దుస్థితి. కొన్నేళ్లుగా జూలై లోనే గోదావరి ఉగ్రరూపం దాల్చిన సందర్భాలున్నాయి. దీంతో ఈనెల ఎట్లా ఉంటుందోనన్న ఆందోళన అలముకుంది. ఇప్పటికే భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం 3 గంటలకు భద్రాచలంలో 24.10 అడుగులకు గోదావరి చేరుకుంది. గతేడాది జూలై 27న భద్రాచలం వద్ద గోదావరి 53.6 అడుగుల గరిష్ఠ ప్రవాహం నమోదైంది. దీంతో లోతట్టు గ్రామాలు నీట మునగడమే కాకుండా రాకపోకలు నిలిచిపోయాయి.


వరరామచంద్రపురంలో లోతట్టు ప్రాంత వాసులు ఏర్పాటు చేసుకుంటున్న వలస పాకలు

ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం..

గడచిన ఆరున్నర దశాబ్దాల కాలంలో జూలై నెలలో గోదావరి వరద ఉధృతిని పరిగణలోకి తీసుకుంటే 14 సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. అదే దశలో ఆరు పర్యాయాలు తుది ప్రమాద హెచ్చరిక (53 అడుగులు) దాటి ప్రవహించింది. వరుసగా 1972 జూలై 6న 44.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 24న 56.7, 2003 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 47, 2016 జూలై 12న 52.4, 2022 జూలై 16న 71.3 అడుగులు, 2023 జూలై 30న 56.1, 2024 జూలై 27న 53.6 అడుగులకు చేరుకుని ప్రవహించింది. వీటిలో 2022 జూలై 16న రికార్డుస్థాయిలో 71.3 అడుగుల మేర గోదావరి ప్రవాహం నమోదైంది. దీంతో చింతూరు డివిజనులోని లోతట్టు గ్రామాలు ఛిద్రమయ్యాయి. ఇళ్లు కూలిపోయి బురదలో కూరుకపోయాయి. ఇక రహదారులు సరేసరి. భద్రాచలంలో గోదావరి నది 59 అడుగుల నుంచి 63 అడుగుల వరకు ప్రవహించిన క్రమంలో చింతూరు డివిజనులోని 180 గ్రామాలపై ఆ ప్రభావం పడనుంది. ఆపై ప్రవాహం ఉంటే మునక మరింత పెరుగుతూ ఉంటుంది.

సమీక్షలు...

ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఒక పర్యాయం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ మండలాల వారీగా వరద సమీక్షలు నిర్వహించారు. ఆ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలు, అధికారులకు స్పష్టం చేశారు. భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతుండడం, రానున్న రెండు రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికలతో లోతట్టు వాసులు సురక్షిత ప్రాంతాలలో వలస పాకల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అదే దశలో సామగ్రిని కూడా సురక్షిత ప్రదేశాలలో భద్రపర్చుకుంటున్నారు.

సత్యనారాయణకు హ్యాండ్‌లూమ్స్ వేడుకల్లో పాల్గొనే అవకాశం


సత్యనారాయణ

ముమ్మిడివరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఆగస్టు 7న జరిగే నేషనల్ హ్యాండ్‌లూమ్స్ డే సెలబ్రేషన్స్ వేడుకల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గేదెలలంక చెందిన చేనేత కార్మికుడు పచ్చిపీలం వీరవెంకటసత్యనారాయణకు అవకాశం దక్కింది. ఈ మేరకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ నుంచి సత్యనారాయణకు వర్తమానం అందింది. ప్రధాని మోదీ పాల్గొనే హ్యాండ్‌లూమ్ సెలబ్రేషన్స్‌లో పాల్గొనే అవకాశం సత్యనారాయణకు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గతేడాది ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొనే అవకాశం సత్యనారాయణకు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యూఢిల్లీ, ముంబై, కలకత్తా రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన చేనేత ఎగ్జిబిషన్‌లో సత్యనారాయణ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తుంటాడు. సత్యనారాయణ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అనేకమంది పేద చేనేత కార్మికులకు పలు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నాడు. ఎన్‌హెచ్‌డీపీ ద్వారా పేదలకు వర్క్‌షెడ్ల నిర్మాణం, ముద్ర రుణాలు, చేనేత మగ్గాలు వంటివి సమకూర్చాడు. 27మందికి ఒక్కొక్కరికీ రూ.లక్షా 20వేలు వంతున ఉచితంగా షెడ్ల నిర్మాణం, 30మందికి 25శాతం రాయితీపై ముద్ర లోన్లు, 30శాతం రాయితీపై 35మందికి మగ్గాల కొనుగోలుకు ఒక్కొక్కరికీ రూ.30వేలు వంతున అందించాడు. సత్యనారాయణ చేస్తున్న సేవా కార్యక్రమాలు, చేనేత ఉత్పత్తుల ప్రదర్శనలు ఏర్పాట్లు చేయడంలో ఉత్సాహం ప్రదర్శించడంతో ఈ అవకాశం దక్కింది.

ఇద్దరు బాలికల మిస్సింగ్‌పై కేసు


నల్లా లతాశ్రీ


నల్లా సత్యవతి

రావులపాలెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలు ఇంట్లో చెప్పకుండా కనిపించకుండా వెళ్లిపోయిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన నల్లా లతాశ్రీ (17), నల్లా సత్యవతి (14) ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు వారి ఆచూకీ కోసం గాలించిన లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్స్ రాగిదిమ్మల చోరీలు...
దొరికిన అంతర్ జిల్లా దొంగలు

ముఠా సభ్యులను దేవరపల్లిలో పట్టుకున్న పోలీసులు
రూ.10 లక్షల విలువైన 67 రాగిదిమ్మలు, 2 కార్లు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్


పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగిదిమ్మలు

దేవరపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగిదిమ్మలు దొంగిలించిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని రాగి వైర్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ, కొవ్వూరు ఎస్‌డీపీవో, రాజమహేంద్రవరం సీసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఆ టీమ్‌లు సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల సహకారంతో నలుగురు అంతర్ జిల్లాల దొంగలను దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద గురువారం అరెస్టు చేసినట్టు తెలిపారు. వారితో పాటు రాగివైరు కొనుగోలు చేసిన ఇద్దరు వ్యాపారులను కూడా అరెస్టు చేసినట్టు చెప్పారు. వారు తూర్పుగోదావరి, ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, కోనసీమ జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగిలించారని, వాటి విలువ రూ.10లక్షలు ఉంటుందని తెలిపారు. చోరీలకు పాల్పడిన పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం రాయికుదురు గ్రామానికి చెందిన కడలి సతీష్, ఏలూరు జిల్లా కృతివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేండ్రపు దుర్గాశ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన బళ్లా విజయరత్నం, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాల దిబ్బ గ్రామానికి చెందిన ఏలూరు పోసియ్యలతో పాటు పాటు చోరీ సొత్తు కొన్న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గొల్లవాని దిబ్బ గ్రామానికి చెందిన పావురాయిల కోటేశ్వరరావు, భీమవరం మండలం దిర్శిమర్రు గ్రామానికి చెందిన సవరపు భీమారావును అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారి నుంచి రూ.10 లక్షల విలువైన 67రాగిదిమ్మలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. వీటితో పాటు 2 కార్లు, 2 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు గతంలో వివిధ పోలీస్‌స్టేషన్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నేరాలపై అరెస్ట్ అయ్యి బెయిల్‌పై ఉన్నారని తెలిపారు. కేసును చేధించిన దేవరపల్లి సీఐ బీఎన్‌నాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, రాజమండ్రి సీసీఎస్ సీఐ శ్రీధర్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో దేవరపల్లి విద్యుత్ ఏఈ సీ.వెంకట్రావు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రాజోలు ఆర్ఐ


పట్టుబడిన ఆర్ఐ రాంబాబు

రాజోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ రాజోలు ఆర్ఐ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన గుబ్బల కృష్ణతులసి భర్త అగ్నిమాపక అధికారిగా పనిచేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 27 మరణించారు. కృష్ణతులసి ఈనెల4న తన పేరున ఎలాంటి ఆస్తులు లేనట్టు నో ప్రాపర్టీ సర్టిఫికెట్, ఎలాంటి సంపద లేనట్టు నో ఎర్నింగ్ నంబరు సర్టిఫికెట్ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సిందిగా కోరుతూ రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంది. దరఖాస్తుపై విచారణ రిపోర్టును తహశీల్దార్‌కు పంపడానికి రాజోలు ఆర్ఐ కె.రాంబాబు రూ.20వేలు డిమాండ్ చేశాడు. కృష్ణతులసికి ఆ లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులకు ఆర్‌ఐపై ఫిర్యాదు చేసింది. తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రాజోలు ఆర్ఐ రాంబాబు లంచం రూ.20వేలను తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఆర్ఐను శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు. దాడిలో ఇన్‌స్పెక్టర్లు ఎస్వీ భాస్కరరావు, వై.సతీష్‌కుమార్, డి.వాసుకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడలో 320 గ్రాముల బంగారం చోరీ


పగులగొట్టి ఉన్న బీరువా లాకర్

కాకినాడ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో సుమారు 320 గ్రాముల బంగారం చోరీ అయినట్టు టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. కాకినాడ ప్రతాప్‌నగర్ ట్రెజరీ కాలనీకి చెందిన భూపతి శ్రీదేవి గత కొన్ని రోజులుగా ఇంటికి తాళం వేసి నాగపూర్ వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తలుపులు బద్దలు గొట్టి తెరిచి ఉండడాన్ని పై పోర్షన్‌లో ఉంటున్న ఆమె బంధువులు గమనించి శ్రీదేవికి సమాచారం అందించారు. దాంతో ఆమె తన బంధువులతో లోపలకి వెళ్లి పరిశీలించమని కోరింది. ఈ క్రమంలో సుమారు 320 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అవ్వడంతో పాటు రూ.15 వేలు నగదు, మరికొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్టు బంధువుల ద్వారా ఆమె తెలుసుకుంది. ఆమె బంధువులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ ప్రారంభించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించాయి.

ఆదియోగి విగ్రహం పాక్షికంగా ధ్వంసం

సామర్లకోటలో ఘటన
పోలీసులకు ఫిర్యాదు


విగ్రహం ముక్కు భాగాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

సామర్లకోట, జూలై10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి పుష్కరిణి సమీపాన భీమేశ్వరాలయం రోడ్డు వద్ద విశేష పూజలందుకుంటున్న ఆదియోగి శిలా విగ్రహం ముక్కు భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం ఆ దారిన వెళ్లే భక్తులు చూసి స్థానికులకు సమాచారం అందించారు. భీమేశ్వరాలయ కమిటీ మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ ఆదియోగి విగ్రహాన్ని పరిశీలించారు. ఇటీవలే కార్తీకమాసంలో విగ్రహాన్ని కాశీ పుణ్యక్షేత్రం నుంచి తీసుకువచ్చి ఎమ్మెల్యే చినరాజప్ప చేతులమీదుగా ప్రతిష్ఠించిన విషయం విదితమే. ఎమ్మెల్యే చినరాజప్పకు సమాచారం అందివ్వగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా విగ్రహ ధ్వంసం చర్యలకు పాల్పడినవారిని గుర్తించి అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.


రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

పెరుగుతోన్న గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి గోదావరి నీటి మట్టం 10.30 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ 175గేట్లను మరింత పైకి ఎత్తి 0.60 మీటర్ల వద్ద ఉంచి 2,65,105 క్యూసెక్కులను దిగువకు వదిలివేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో అన్ని చోట్ల నీటిమట్టం పెరుగుతుంది. శుక్రవారం సాయంత్రానికి సుమారు 5 లక్షల క్యూసెక్కుల ప్రభావం, శనివారం నాటికి 9 లక్షల క్యూసెక్కులు వరద ప్రవాహం ధవళేశ్వరానికి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటి మట్టం 24.50 అడుగులకు చేరుకుంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి మూడు డెల్టాలకు 13750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పోలవరం ప్రాజెక్ట్ ఉద్యోగి మృతి

సీతానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో అద్దె ఇంటిలో ఉంటూ పోలవరం ప్రాజెక్ట్‌లో ఉద్యోగం చేస్తున్న అంకిత్ కటియార్(34) విద్యుదాఘాతంతో మృతి చెందినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో ఫీల్డ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్ ఉదయం 8గంటలకు ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న తన భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. 9 గంటల నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయక పోవడంతో ప్రాజెక్ట్‌లో ఉద్యోగం చేస్తున్న హెచ్‌ఆర్‌కు ఫోన్ చేసి తెలియపరచగా సహ ఉద్యోగి విశాఖ పట్నానికి చెందిన తాతనపాత్రుని గిరిబాబు వచ్చి చూడగా చేతిలో చిన్నఫ్యాన్‌తో కటియార్ నిర్జీవంగా ఉన్నాడు. దీంతో అతడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్టు గుర్తించారు. మృత దేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గిరిబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కరప, జూలై 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందినట్టు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ సూరిబాబు తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం మట్లపాలెనికి చెందిన వనమాడి మహేష్(24) కాకినాడ పోర్టులో పనిచేస్తున్నాడు. ఈనెల 8న ఇంటి నుంచి డ్యూటీకి బైక్‌పై బయలుదేరి కరప మండలం ఉప్పలంక వంతెన దిగుతూ అదుపుతప్పి కిందపడడంతో గాయపడ్డాడు. కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు.

మా కుటుంబంపై అసత్యప్రచారాన్ని ఆపండి

లేకపోతే ఎదురుదాడికి దిగుతాం : జక్కంపూడి గణేష్

కాకినాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబంపై జనసేన నేతలు సోషల్‌మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని లేకపోతే ఎదురుదాడికి దిగుతామని వైసీపీ యువజన విభాగం ప్రాంతీయ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేశ్ అన్నారు. తన తండ్రి దివంగత రామ్మోహనరావు, అన్న రాజా, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారు ముందు వారి పార్టీ గురించి, నాయుల పరిస్థితి తెలుసుకోవాలని హితవు పలికారు. గురువారం కాకినాడలోని ఆయన బంధువుల ఇంట్లో మీడియాతో మాట్లాడారు. తమ కుటుంబంపై జనసేన నేతలు బెట్టింగ్ మాఫియా, భూ కబ్జాలు, పేకాట క్లబ్బులు నిర్వహిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిలో ఆధారాలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీలు మారతామంటూ దుష్ప్రచారం చేస్తున్న కూటమి నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. తాము ఎప్పటికీ వైసీపీలోనే ఉంటామన్నారు. తమ కుటుంబాన్ని విమర్శించిన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీలు వారి పనితీరులో దిగజారిపోయారన్నారు. కూటమి ఎప్పుడు బద్దలవుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఆ పార్టీ నేతలున్నారన్నారు.







గోదారి ఉరకలు.. అందాల వెలుగులు

ఒకవైపు గోదావరి ఉరకలు వేస్తుంటే మెల్లగా వచ్చాడు సూరీడు. తన వెలుగును కాస్త గోదావరిపై ప్రసరింపచేసి మరింత అందంగా మార్చివేశాడు. అల్లూరి జిల్లా కూనవరం మండలం శబరి, గోదావరి సంగమం వద్ద గురువారం సాయంత్రం వేళ కనిపించిన ఈ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా వడిసిపట్టింది. - కూనవరం (ఆంధ్రజ్యోతి)

శాకంబరిగా కనకదుర్గమ్మ

అయినవిల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం గురు పౌర్ణమిని పురస్కరించుకుని నేదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రికాలాగ్ని కాల రుద్రుడు క్షేత్రంలోని శ్రీకనకదుర్గమ్మను శాకంబరిగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం నిర్వహించారు.

విద్యాప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం

- ఎమ్మెల్యే ఆనందరావు, జేసీ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, డీఈవో షేక్ సలీంబాషా
- ఘనంగా మెగా పీటీఎం కార్యక్రమాలు





అమలాపురం: వన్నెచింతలపూడిలో మొక్కలు పంపిణీ చేస్తున్న జేసీ నిషాంతి, రాజోలు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అంబాజీపేట: తల్లిదండ్రులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అమలాపురం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అంత్యంత కీలకమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో సోమవారం మండల విద్యాశాఖ పరిధిలోని 106 ప్రభుత్వ పాఠశాలలు, 60 ప్రైవేటు పాఠశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని పలు పాఠశాలల్లో జరిగిన మెగా పీటీఎంలో పాల్గొన్న ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే ఆనందరావులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒకే వేదిక పైఉంచి విద్యాభివృద్ధికై చర్చలు నిర్వహించడం శుభపరిణామమని జేసీ నిషాంతి పేర్కొన్నారు. వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జరిగిన మెగా పీటీఎంలో జేసీ నిషాంతి పాల్గొన్నారు. హెచ్ఎం గుబ్బల నాగసత్యనారాయణ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జేసీతో పాటు ఆర్డీవో కె.మాధవి పాల్గొన్నారు. ఆర్డీవో మాధవికి విద్యార్థులు పాదపూజ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ నంద్యాల మనువిహార్, చైర్మన్ నంద్యాల నాయుడు, స్నేహప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 ప్రభుత్వ, 9ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొల్లాటి సత్యవతిసత్యం, జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ, సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీవో కేవీ చలం, ఎస్ఐ అవినాష్ పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మామిడికుదురు జూనియర్ కళాశాల, హైస్కూలులో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో కలెక్టర్ మాట్లాడారు. జూనియర్ కళాశాలను సందర్శించి కళాశాలలోని కెమిస్ట్రీ ల్యాబ్, వసతులు, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్ల నిర్వహణ విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేసి ఆదేశాలు జారీ చేశారు. మామిడికుదురు హైస్కూలులో స్థానికులు, ప్రధానోపాధ్యాయునితో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు, పీఎంసీ కమిటీ చైర్మన్ వేగి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లల తీరును గమనించాలి

పిల్లల తీరును తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలియచేశారు. మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో ఆయన పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలిచ్చారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం కల్పించి వేలాది కోట్ల రూపాయలు విద్యాభివృద్ధికి కేటాయిస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశాలు జరిగాయి. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఉన్న 88 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 5జూనియర్ కళాశాలల్లో ఘనంగా మెగా పీటీఎం డే నిర్వహించామని ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. రాజోలు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో డిప్యూటీ కలెక్టర్ మమ్మీ పరిశీలించారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో 70ప్రభుత్వ, 19 ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ 2.0 ఆత్మీయ సమావేశాలు విజయవంతంగా జరిగాయి. మండల విద్యాశాఖాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖలవారు పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులతో ముచ్చటించారు. కొన్నిపాఠశాలల్లో విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలో మెగా పేరెంట్స్ టీచర్స్‌డే ఘనంగా జరిగింది. మండలంలోని 76ప్రభుత్వ, 29 ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్‌డే నిర్వహించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి, ఎంఈవో విజయశ్రీ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 94పాఠశాలలు, రెండు కళాశాలల్లో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలు ఉత్సాహంగా నిర్వహించారు. గొల్లవిల్లి ఉన్నత పాఠశాలలో తల్లులు ఎంతో ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. భీమనపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కూటమి నాయకులు అరిగెల నానాజీ, సలాది నాగరాజు, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం విద్యా వ్యాప్తికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అల్లవరం గుడివానిచింత బీవీసీ అక్షర్ ఇంటర్నేషనల్ స్కూలులో జరిగిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. అక్షర్ స్కూలు పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలపై ఎండీ బోనం విజయలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. బండిగుప్తాపు పాండురంగ, ప్రిన్సిపాల్ స్మిత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఓడలరేవు, దేవగుప్తం, అల్లవరం జడ్పీ హైస్కూళ్లలో మెగా పేరెంట్స్ టీచర్స్ డే సమావేశాలు జరిగాయి. అల్లవరం హైస్కూలులో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, తహశీల్దార్ వీవీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సంబరాలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో గురువారం పండుగ వాతావరణంలో జరిగాయి. మండలంలోని 66 ప్రాథమిక, 2ప్రాథమికోన్నత, 11జడ్పీ ఉన్నత, 18 ప్రైవేటు కాన్వెంట్‌లు, ఒక ప్రభుత్వ కళాశాల, 5ప్రైవేటు కళాశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమం జరిపారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, హైస్కూలు ప్లస్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, హెచ్ఎం సీహెచ్ పరిమళపాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మెగా పీటీఎం 2.0తో పల్లెల్లో పండుగ వాతావరణ నెలకొందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నరేంద్రపురం గురుకుల పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ఆర్.ఏనుగుపల్లి, పి.గన్నవరం జడ్పీ హైస్కూల్లో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమాల్లో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలో 97పాఠశాలల్లో మెగా పీటీఎం కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపాల్ వేణు, పప్పుల సాయిబాబు, సాధనాల శ్రీవెంకట సత్య నారాయణ, ఏసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర హోదాయే సరైన పరిష్కారం: సీఎం రంగసామి



బీజేపీ ఇన్‌చార్జ్ సూరానాను సత్కరిస్తున్న సీఎం రంగసామి

యానాం, జూలై 10(ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా లెఫ్టినెంట్ గవర్నర్, ప్రభుత్వానికి మధ్య ఎప్పుడూ అభిప్రాయ బేదాలు ఉంటాయని, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇస్తే విభేదాలు రావని ముఖ్యమంత్రి ఎన్.రంగసామి అన్నారు. సీఎం ఎన్.రంగసామి, లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్‌నాథన్ మధ్య విభేదాలు తలెత్తిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి బీజేపీ పుదుచ్చేరి ఇన్‌చార్జ్ సూరానా పుదుచ్చేరికి పంపింది. సూరానా శుక్రవారం సీఎం రంగసామితో సమావేశం అయ్యారు. ఈసమావేశంలో మంత్రి నామశ్శివాయః, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగంతో పాటు పలువురు హాజరయ్యారు. ప్రస్తుతం పుదుచ్చేరిలో ఉన్న రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ 2026 ఎన్నికలకు సంబంధించి చర్చించామని తెలిపారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. పరిపాలనలో చిన్న, చిన్న సమస్యలను పరిష్కరిద్దామన్నారు.

కేతా శ్రీను కుటుంబానికి అండగా టీడీపీ




తాటిపాక సంతాప సభలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్
కేతా శ్రీను భార్య వెంకటలక్ష్మిని పరామర్శిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి, ఎమ్మెల్సీ

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు
- కేతా శ్రీను సంతాప సభ

రాజోలు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాజోలు ఎంపీపీ కేతా శ్రీను కుటుంబానికి టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం తాటిపాకలో శ్రీను స్వగృహం వద్ద సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన రాజోలు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కేతా శ్రీను సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేతా శ్రీను టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా, తాటిపాక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా అనేక పదవులు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆదేశాలతో నేను స్వయంగా ఈసంతాప సభలో పాల్గొన్నట్టు తెలిపారు. టీడీపీ కార్యకర్తలకు ఎంతో గౌరవం ఇస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. మరో ముఖ్యఅతిథి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరిలోనే ఎంపీటీసీగా అత్యధిక మెజార్టీతో విజయ ఢంకా మోగించి శ్రీను ఘన చరిత్రను సొంతం చేసుకున్నారని తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ శ్రీను చిన్న వయసులోనే మృతిచెందడం పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం కేతా శ్రీను భార్య వెంకటలక్ష్మిని వారు పరామర్శించి పార్టీ మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తొలుత కేతా శ్రీను చిత్రపటానికి వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, జడ్పీటీసీ మట్టా శైలజ, మాజీ జడ్పీచైర్మన్ నామన రాంబాబు, హార్టికల్చర్ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు, చాగంటి స్వామి, బోళ్ల వెంకటరమణ, చెల్లుబోయిన శ్రీనివాస్, వైస్‌ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, ఇంటిపల్లి ఆనందరాజు, మంగెన భూదేవి, గుబ్బల బాబ్జి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి పాలన జనరంజకం

- అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- గొల్లవిల్లిలో సుపరిపాలన

ఉప్పలగుప్తం, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సంక్షేమ పథకాల అమలు ద్వారా జనహృదయాల్లో ఆనందాన్ని నింపినట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లిలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పండు వెంకటేశ్వరరావు, గొలకోటి సత్తిరాజు, నల్లా సత్యనారాయణ, పేరాబత్తుల చిన్నా, సలాది పట్టాభి, చప్పిడి వెంకటనాగేశ్వరరావు, కాగిత సత్యనారాయణ, మద్దింశెట్టి సీతారామస్వామి, యాళ్ళ సత్తిబాబు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు శిక్షణ

అంతర్వేది, జూలై 10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది గ్రామ సచివాలయం వద్ద సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ, ఉప ప్రాంతీయ విభాగం కాకినాడవారి ఎంపెడ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపెడ జేటీవో బంగారమ్మ విచ్చేసి మాట్లాడారు. ఎంపెడ స్కీమ్స్ సబ్సిడీ పథకాలు రైతులు ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్) పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక: ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, జూలై 10(ఆంధ్రజ్యోతి): అమలాపురం నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను నూరు శాతం పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లి శ్రీనిమ్మకాయల చినరాజప్ప కళ్యాణమండపంలో గురువారం ట్రాన్స్‌కో అధికారులు, విద్యుత్ వినియోగదారులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా విద్యుత్ సమస్యలను జీరో స్థాయికి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన వివరించారు. ప్రస్తుతం రూ.86లక్షలతో మండలంలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ ఏర్పాటు చేసినట్టు ఈఈ కె.రాంబాబు వివరించారు.కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, అరిగెల నానాజీ, చిక్కం భీముడు, కంకటాల రామం, ఆకుల బుజ్జి, మద్దింశెట్టి సీతారామస్వామి, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, సుంకర రాంబాబు, నల్లా బాబండి, లంకే భీమరాజు, చిక్కం వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నేడు మెడిటేషన్ ఫర్ ది నేషన్

అమలాపురం టౌన్, జూలై10(ఆంధ్రజ్యోతి): అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం మెడిటేషన్ ఫర్ ది నేషన్ కార్యక్రమం ఈనెల10 నుంచి 16వరకు నిర్వహిస్తున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ తెలిపారు. దీనిలో భాగంగానే ధ్యానం విశిష్టతను వివరిస్తూ కోర్టు ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓఎన్జీసీ తీరుపై నిరసన



పాశర్లపూడిలో ఓఎన్జీసీ తీరును నిరసిస్తూ స్థానికుల ధర్నా

మామిడికుదురు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలోని ఓఎన్జీసీ డ్రిల్లింగ్ బావి వద్ద బుధవారం రాత్రి గ్యాస్ లీక్ అవడంతో స్థానికులు తమకు రక్షణ కల్పించాలని గురువారం డ్రిల్లింగ్ సైట్ వద్ద ధర్నా చేశారు. పాశర్లపూడిలంక, పాశర్లపూడి గ్రామాల సరిహద్దులో ఉన్న రిగ్ వద్ద ధర్నా చేసి ఆవేదనను వెళ్లగక్కారు. ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల భయాందోళనల మధ్య జీవించాల్సి వస్తుందని, ఎక్కడో కూర్చొని అధికారులు పరిస్థితి అదుపులో ఉంది అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని తమకు వివరించి తగిన భరోసా ఇవ్వాలని డ్రిల్లింగ్ సైట్ వద్ద జరుగుతున్న పనులు అడ్డుకున్నారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, మోకా దుర్గారావు, అబాల దొరబాబు, గోనిపాటి మధుబాబు, పొన్నమండ రామస్వామి, తాడి శ్రీనివాస్, పొలమూరి గోపాల్, ఉండ్రు చిన్నాపాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ముమ్మిడివరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా ముమ్మిడివరంలోని శ్రీసాయిబాబా ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు

ఎమ్మెల్యే సార్ సమస్యలు పరిష్కరించరూ..



పి.గన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో భాగంగా మా పాఠశాలలో ఫ్యాన్లు తిరగడం లేదు, హాస్టల్‌లో ఆర్‌ఓ ప్లాంట్ లేదు, కుళాయిలు లేవు, మరుగుదొడ్లకు తలుపులు లేవు తదితర సమస్యలు పరిష్కరించండి సార్ అంటూ నరేంద్రపురం గురుకుల పాఠశాల ముగ్గురు విద్యార్థులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎదుట ప్లకార్డులు ప్రదర్శించారు. సమస్యలను రాతపూర్వకంగా తెలియజేస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సొసైటీ చైర్‌పర్సన్‌గా ఉమేష్



ఉప్పలగుప్తం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్‌గా చిక్కం ఉమామహేశ్వరరావు(ఉమేష్) గురువారం బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా బొంతు లక్ష్మీనారాయణ, కుంచే నాగేంద్రప్రసద్ ప్రమాణ స్వీకారం చేశారు. డీసీసీబీ మేనేజర్ పీఆర్ఎన్ శర్మ, సీఈవో ఆకుల సూర్యప్రభాకరరావు, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ చిక్కం పెద్దబ్బులు పాల్గొన్నారు.

సాయిబాబాకు అలంకరణ

ఐ.పోలవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ సందర్భంగా ఐ.పోలవరంలో షిరిడీ సాయిని బిస్కట్ ప్యాకెట్లతో అలంకరించారు. గ్రామానికి చెందిన మద్దిరెడ్డి మూర్తి, హరికృష్ణకుమారి దంపతులు కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీలో జెస్సీకి స్వర్ణ పతకం



జెస్సీకి కృష్ణసతీష్ అభినందనలు

అమలాపురం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ఇంటిలిజెన్సీ అండ్ డేటా సైన్స్ విభాగంలో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని గెడ్డం అంకితజెస్సీ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించింది. జవహర్‌లాల్‌నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(కాకినాడ) నిర్వహించిన స్నాతకోత్సవంలో యూనివర్శిటీ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జెస్సీ స్వర్ణపతకం అందుకుంది. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జెస్సీని బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావులు ప్రత్యేకంగా అభినందించారు. స్వర్ణ పతకం సాధిచడంలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సహకారం ఎంతోఉందని జెస్సీ పేర్కొంది. కార్యక్రమంలో పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ మదన్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొని జెస్సీని అభినందించారు.

ప్రత్యేకావసరాల వారికి బాసటగా ప్రభుత్వం

పి.గన్నవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల గల వారికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రూ.11.11 లక్షల విలువైన సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి మిషన్లను 99మందికి అందించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్డీఏ పీడీ టి.సాయినాథ్ జయచంద్ర గాంధీ, ఎంపీపీలు గనిశెట్టి నాగలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవోలు జి.ఉమామహేశ్వరరావు, ఏపీఎల్ నరసింహం, సరోవర్, సర్పంచ్‌లు బొండాడ నాగమణి, యల్లమిల్లి కృష్ణవేణి, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు, పప్పుల సాయిబాబు, పులపర్తి చిన వెంకటలక్ష్మి, మద్దాల సుబ్రహ్మణ్యం, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీరేశ్వరుని ఆలయంలో చండీహోమం

ఐ.పోలవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఏసీ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆకొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు

ముమ్మిడివరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): చినకొత్తలంక మెయిన్ నుంచి సత్తెమ్మతల్లి ఆలయానికి వెళ్లే రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో తరచూ విద్యుత్ సమస్య తలెత్తుతుందని, మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు.గురువారం పిల్లావారి వీధిలో కొత్తలంకబాబా ఆలయానికి వెళ్లే మార్గంలో కొబ్బరిచెట్టు పడి 11కేవీవిద్యుత్ తీగలు తెగిపడి ఆ సమయంలో అటుగా వెళుతున్న కాట్రేనికోన మండం కొప్పిగుంట గ్రామానికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావు విద్యుత్‌ప్రమాదాయానికి గురయ్యాడని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొత్తూరి మల్లికార్జునవర్మ తెలిపారు. లైన్‌మెన్‌ను ఏర్పాటుచేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయాలని, సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆగ్రామ ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, జూలై 10(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన, చెయ్యేరు సబ్ స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు నిమిత్తం శుక్కవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. వేట్లపాలెం, జీకేపొర, చిర్రయానాం, బలుసుతిప్ప, కొప్పిగుంట, పల్లంకుర్రు, కందికుప్ప, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతికుర్రు, బంటుమిల్లి, ఉప్పూడి, లక్ష్మీవాడ, పెనుమెల్ల, చెయ్యేరు, చెయ్యేరుఅగ్రహారం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల పనుల్లో భాగంగా ముక్కామల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యా హ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కె.రాంబాబు తెలిపారు. ముక్కామల, వక్కలంక, పసుపల్లి, వానపల్లి, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, చినలంక, కముజువారిలంక, చిరతపూడి, కొత్తపేట మండలం మోడేకుర్రు, అయినవిల్లి మండలం నేదునూరు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కోసం శుక్రవారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు అమలాపురం ఏఈ కె.రాంబాబు తెలిపారు. లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, మానేపల్లి, చాకలిపాలెం, వాడ్రేవుపల్లి, కనకాయలంక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ భీమనపల్లి ఫీడర్ లైన్ ట్రీట్రిమ్మింగ్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. సూదాపాలెం, భట్నపాలెం, నంగవరం, సింగరాయపాలెం, విలసవిల్లి, భీమనపల్లి గ్రామాకు సరఫరా ఉండదన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అల్లవరం, బెండమూర్లంక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కోసం శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్న ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లవరం, గోడితిప్ప, గోడిలంక, తూర్పులంక, మొగళ్లమూరు, తుమ్మలపల్లి, ఓడలరేవు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ బి.వెంకటేశ్వరరావు తెలిపారు.

వరదలపై అప్రమత్తం చేయండి

అల్లవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ ప్రాంతంలో వరదలు పోటెత్తుతున్నందున వైనతేయ గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవో కె.మాధవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వరద పరిస్థితులపై కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.


కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో తాత్కాలిక రహదారిని పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

కోటిపల్లిలో పెరిగిన గోదావరి ఉధృతి

కె.గంగవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరుతో కోటిపల్లి వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. పుష్కరాల రేవులో మెట్ల వరకు నీరు చేరుకుంది. ఫెర్రి రేవులోని తాత్కాలిక రహదారి కొంతమేర వరద నీటిలో చిక్కుకుంది. గురువారం రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల గోదావరి ఉధృతిని పరిశీలించి సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించి ప్రతిష్ఠతకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో తాత్కాలిక రహదారిని ఆమె తహశీల్దారు శ్రీరాం ప్రసాద్, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. గోదావరి వరద పెరిగే అవకాశం ఉన్నందున ఫెర్రీ రేవులో రాకపోకలు నిలిపి వేయాలని ఆదేశించారు. రేవు నిర్వాహకులకు ఎంపీడీవో శ్రీనివాస్ నోటీసు జారీ చేసి వరద ఉధృతి తగ్గే వరకు రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించామన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. చెట్టుకొమ్మలు నరకడం, లైన్ల మరమ్మతుల కారణంగా మాచవరం, సోమేశ్వరం, పసలపూడి టౌన్, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మండపేటలో: తాపేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మలు, మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ రత్నాలరావు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ తాపేశ్వరం ఫీడర్ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కపిలేశ్వరపురంలో: అంగర సబ్‌స్టేషన్ పరిధిలోని అంగర, వల్లూరు, కపిలేశ్వరపురం, పడమరఖండ్రిక, వెదురుమూడి, టేకి, మాచర మట్టలు, శ్రీరామపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం డీఈఈ రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కొత్త బ్రేకర్స్ పెట్టడం వల్ల కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం, పట్టణంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ రత్నాలరావు తెలిపారు. చెట్టు కొమ్మలు, లైన్ల మరమ్మతు నిమిత్తం ద్రాక్షారామ సబ్‌స్టేషన్ పరిధిలో ద్రాక్షారామ, చినతాళ్లపొలం, పెద తాళ్లపొలం, ఉట్రుమిల్లి, నెలపర్తిపాడు, వెలంపాలెం, వెంకటాయపాలెం, వేగాయమ్మపేట, జగన్నాయకులపాలెం, బాపనయ్య చెరువు, ఆదివారపుపేట, అన్నాయిపేట, తోటపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. చోడవరం ఫీడర్‌పై చోడవరం, ఓదూరు, యనమదల, అంబికపల్లి అగ్రహారం పట్టణంలో శీలంవారిసావరం ఫీడర్‌పై పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తామని తెలిపారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.6.40 లక్షలు

ఆత్రేయపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.6,40,000 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఆత్రేయపురం మండలం లొల్లకు చెందిన హనుమంతవరుల సూర్య వెంకట నరసింహకుమార్, లక్ష్మీఫణికుమారి దంపతులు రూ.1,00,005 విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.



కపిలేశ్వరపురంలోని వల్లూరులో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల. పక్క చిత్రంలో కొత్తపేటలోని అవిడిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు

కపిలేశ్వరపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని వల్లూరు, నిడసనమెట్ట, నేలటూరు, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని కూటమి నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. కూటమి పాలన విజయాలు, తెలపడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి కరపత్రాలను అందజేసారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు ముత్యాల శ్రీధర్, వల్లూరి వీరబాబు, బలవరెడ్డి సత్తిబాబు, డి.మీనాకుమారి తదితరులతో పాటు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం అవిడి, ఖండ్రిగ గ్రామాల్లో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ఏడాది పాలనలో అందుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అరాచకాలు సృష్టించాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, గనిశెట్టి వీరేష్, రెడ్డి తాతాజీ, రెడ్డి శ్రీనివాస్, దూనబోయిన ప్రదీప్‌కుమార్ తదితరులతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొండెలగూడేనికి తాగునీరు సరఫరా

ద్రాక్షారామ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శివారు బొండెలగూడేనికి గురువారం తాగునీటి సరఫరాను సర్పంచ్ కొత్తపల్లి అరుణ ప్రారంభించారు. ద్రాక్షారామ ఓవర్ హెడ్‌ట్యాంకు నుంచి పైపులైను ద్వారా బొండెలగూడేనికి తాగునీరు పైపులైను ఏర్పాటు చేశారు. తొలిసారిగా రక్షిత మంచినీరు వీరికి ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తాగునీటికి సౌకర్యం లేక బొండెలగూడెం వాసులు ఎన్నో కష్టాలు పడేవారన్నారు. పంచాయతీ నిధుల నుంచి పైపులైను ఏర్పాటు చేసి తాగునీరు అందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, కర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


తాగునీరు కుళాయి ప్రారంభిస్తున్న సర్పంచ్ అరుణ

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

బాలిక వైద్యానికి మంత్రి ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 10(ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో క్షయవ్యాధికి గురైన మూడేళ్ల బాలికకు మంత్రి సుభాష్ ఆర్థికసాయం అందచేశారు. రత్నంపేటకు చెందిన బాలికకు టీబీ వ్యాధి సోకడంతో వారి కుటుంబానికి రూ.15వేలు అందచేశారు. జనసేన ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్, టీడీపీ నేత శివ తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రపురం రత్నంపేట పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్


కొత్తపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం


మండపేట హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్ కమిటీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

విద్యార్థుల భవిష్యత్‌కు అధిక ప్రాధాన్యం

• మెగా పేరెంట్స్ సమావేశంలో మంత్రి సుభాష్ • ఆయా పాఠశాలల్లో పండుగ వాతావరణంలో మెగా పీటీఎం 2.0

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టామని మంత్రి సుభాష్ అన్నారు. గురువారం రామచంద్రపురంలోని రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ దినోత్సవం జరిగింది. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలువేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యాహక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు ఆరోగ్యవంతమైన పోషకాహారం అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం ద్వారా రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో వేశామన్నారు. త్వరలో పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల తదితరులు మాట్లాడారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కేవీఆర్ రాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, హెచ్ఎం విత్తనాల సుబ్బారావు, విద్యా కమిటీ సభ్యులు, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు విద్యార్థులతో మంత్రి సుభాష్ ముచ్చటించారు.

విద్యార్థుల నడవడికను గమనిస్తుండాలి

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నడవడికను తల్లిదండ్రులు గమనిస్తుండాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్తపేట మండలానికి సంబంధించి 12 ఉన్నత పాఠశాలలు, 71 ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు కలిపి 107 ప్రాంగణాలలో మెగా పేరెంట్స్ సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్‌కుమార్, తహశీల్దారు వై.రాంబాబు, ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, లీలావతిలతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో మెగా పేరెంట్స్ మీటింగ్స్ గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, నాయకుల సమక్షంలో పేరెంట్స్ మీటింగ్స్ జరిగాయి. చెముడులంక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


రావులపాలెంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

పండుగ వాతావరణంలో...

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన మెగా పీటీఎం 2.0 గురువారం ఆయా పాఠశాలల్లో పండుగ వాతావరణంలో జరిగాయి. మండలంలో 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలతో పాటు 14 ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0 నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎస్ఎస్ఏ స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో తాతారావు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి

ఏఎంవో రాంబాబు

రాయవరం, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని సమగ్రశిక్షా అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు పేర్కొన్నారు. గురువారం మాచవరం నెంబర్-1 ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్ డే 2.0 కార్యక్రమంలో ఏఎంవో మాట్లాడారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.రామారావు ఆధ్వర్యంలో మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని 12 గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో మెగా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. తల్లిదండ్రులు ఆటపాటలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, తహశీల్దారు ఐపీ శెట్టి, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, మేడపాటి రవీంద్రారెడ్డి డాక్టర్ జీవీఎస్ఎన్‌రెడ్డి, పీఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం పండుగలా చేపట్టారు. గురువారం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. అంకంపాలెం జడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీవో వెంకటరామన్, సర్పంచ్ ముత్యాబత్తుల రాజు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధిలో తామందరం భాగస్వాములు అవుదామంటూ ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్వీ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరై మాట్లాడారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు 900 మంది పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి బీవీ రమణ, కళాశాల ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కె.నరేష్‌కుమార్‌రెడ్డి, పెచ్చెట్టి చిన్నారావు, గొలుగూరి వెంకటరెడ్డి, సత్తి సోమిరెడ్డి, కొవ్వూరి వెంకటకృష్ణారెడ్డి, గుత్తుల పట్టాభిరామారావు, రాచకొండ శ్రీను, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడితే అనుకున్నది సాధించగలం

మండపేట, (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి కష్టపడితే లక్ష్యాలు సాధించవచ్చని ప్రముఖ చెస్ క్రీడాకారిణి గోలి సంధ్య అన్నారు. ద్వారపూడి జడ్పీ బాలికల హైస్కూల్లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. తాపేశ్వరం సురుచి ఫుడ్స్ పీఆర్వో వర్మ ఆమెను సత్కరించి, బాహుబలి కాజాను ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో సోమిరెడ్డి, హెచ్ఎం బి.రాజేశ్వరి, పీఎంసీ ఛైర్మన్ కంకటాల మురళీకృష్ణ, కూటమి నాయకులు కోన సత్యనారాయణ, చేకూరి రమేష్‌రాజు, సత్తి సత్యనారాయణ, చింతా శ్రీనివాసరావు, మర్రెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. మండపేట రూరల్, మండపేట టౌన్ పరిధిలో మొత్తం 122 పాఠశాలల్లో పేరెంట్స్ మీట్ జరిగాయి. కార్యక్రమంలో ఎంఈవోలు రామచంద్రరావు, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే వేగుళ్ల

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం మండపేట డాక్టర్ పాలడుగుల సత్యవతి, చంద్రమౌళి బాలిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపాల్ ఛైర్మన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ముంగర వెంకటరాజు, భవన నిర్మాణదాత డాక్టర్ పాలడుగుల చంద్రమౌళి, తహశీల్దారు తేజేశ్వరరావు, కౌన్సిలర్ నవరపు సతీష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. మండలంలోని 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 11 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలల్లో, 10 ప్రైవేటు పాఠశాలలు, రెండు ప్రభుత్వ, రెండు ప్రైవేటు కళాశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాలలోను గురువారం పీటీఎం సమావేశాలు జరిగాయి. దంగేరులో జరిగిన సమావేశంలో ఎంఈవో-1 ఎ.నాగరాజు, గంగవరంలో ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు. పామర్రు జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు ఆయా గ్రామాల్లో మొక్కలను నాటారు. ఆయా సభలో పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వక్తలు వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

రావులపాలెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఐషర్ వ్యాన్‌లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండటంతో అధికారులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. రావులపాలెం నుంచి జొన్నాడ వైపు వెళుతున్న ఐషర్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో బిల్లులు లేకుండా ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండటాన్ని గుర్తించి అధికారులు బియ్యంతో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేలుజాతి పశువుల విక్రయ కేంద్రంగా అభివృద్ధి చేయాలి

కొత్తపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేటను మేలు జాతి పశువుల విక్రయ కేంద్రంగా అభివృద్ధి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం అవిడిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవిడి పశువైద్యశాలలో కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన లేగదూడలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు లేగదూడలకు సంబంధించిన పౌష్టికాహారం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీను, రెడ్డి తాతాజీ, రెడ్డి చంటి, దూళి సూరిబాబు, డాక్టర్ విశ్వకళ్యాణి, డాక్టర్ విభా, డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ రేవంత్, డాక్టర్ యామిని తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్

ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

ఆత్రేయపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): జన సైనికులకు పార్టీ అండగా ఉంటుందని జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మెర్లపాలానికి చెందిన రంకిరెడ్డి దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ప్రసాద్‌కు జనసైనికులు అండగా నిలిచారు. రూ.1,90,500లు ఆర్థిక సాయాన్ని శ్రీనివాస్, గాయపడిన దుర్గాప్రసాద్‌కు అందచేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెర్ల రాము, ఎంపీటీసీ వీరబాబు, చేకూరి కృష్ణంరాజు, సూరపురెడ్డి సత్య, జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

• షిర్డిసాయినాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు • తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తజనం


ఆలమూరులో షిర్డిసాయిబాబాను దర్శించుకున్న భక్తులు

రాయవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఠం వేదపండితుల ఆధ్వర్యంలో దత్తాత్రేయ, శ్రీకృష్ణుడు, సాయిబాబాలకు అష్టోత్తర సహస్రనామాలతో కుంకుమార్చనలు, వ్యాస భగవానుడు, ఆదిశంకరాచార్యులు, శృంగేరి పీఠాధిపతులు అభినవ విద్యాభారతి పాదుకలకు గురు అష్టోత్తరాలతో గురు పాదుకా పూజలు, పుష్పార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. పలువురు భక్తులు గాడ్‌కు పాదపూజలు, మంగళహారతుల నిర్వహించి ఆశీస్సులు పొందారు. పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతత లభించాలంటే దైవారాధన తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో పెదపాటి శ్రీనివాసమూర్తి, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి), అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రథమ ఆలయంగా పేరొందిన ఆలమూరు షిర్డిసాయి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, పుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని నర్సిపూడి, జొన్నాడ, మూలస్థానం, చింతలూరు తదితర గ్రామాల్లో షిర్డిసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని షిర్డిసాయి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. రావులపాలెంలో ఉన్న షిర్డీసాయి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు జనార్ధన కేశవమూర్తి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన జ్యోతిర్మయి, సాయిబాబా ప్రవచనాలు వినిపించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈతకోట జాతీయ రహదారి వద్ద ఉన్న షిర్డిసాయి ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆనంద్, డాక్టర్ నెహ్రూ నాయక్, డాక్టర్ కేఎస్ఆర్ కిరణ్, వెంకన్న, మధు, సుందర్ రామకృష్ణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కూళ్ల, పాణింగపల్లి, సత్యవాడ తదితర గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాణింగపల్లి సాయిబాబా ఆలయంలో భక్తులు సాయినాథుడికి పాలాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు సాయిని దర్శించుకున్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. వల్లూరులో షిర్డీసాయికి కాగడహారతి, నగర సంకీర్తన, దత్తాత్రేయుడికి క్షీరాభిషేకం, భక్తులతో సాయివ్రతం నిర్వహించారు. కపిలేశ్వరపురం, కోరుమిల్లి, నల్లూరు, కాలేరు తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం మండలం వల్లూరులో సాయిబాబా వ్రతాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా అమ్మవార్ల ఆషాడమాసోత్సవాలు

కపిలేశ్వరపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అంగర గ్రామంలో ఉన్న నూకాంబిక, ఆదిలక్ష్మి అమ్మవార్ల శాకంబరి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆషాడశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వివిధ రకాలు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారి విగ్రహాలను అలంకరించారు. వేదపండితులు సంపర శ్రీనివాసచార్యులు, ఆలయ ఆసాదుల ఆధ్వర్యంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి రాజా సీతారాం, శ్రావణి సంతోషి దంపతులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా మేళతాళాల మధ్య ఊరేగింపు జరిపి అమ్మవార్లకు ఆషాడం సారె సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీదేవి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంగర గ్రామంలో శాకంబరి ఉత్సవాలు జరపడం ఇదే తొలిసారి అని, ఇక నుంచి ప్రతీ ఏటా ఉత్సవాలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పిల్లా బసవరాజు, దానేటి శరత్, మేడిద సుబ్రహ్మణ్యం, దాసరి ఆంజనేయులు, గరగశ్యాంబాబు, గంధ్రోతుల నాగమహేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


అమ్మవారిని పండ్లు, కాయగూరలతో అలంకరించిన దృశ్యం


డిపో మేనేజర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న తిరుమలరావు

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ప్రశంసాపత్రం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజరు పేపకాయల భాస్కరరావుకు టైరువిభాగంలో జీరోస్క్రాప్ సాధించినందుకు ప్రశంసాపత్రం లభించింది. ఆర్టీసీ ఎండీ తిరుమలరావు డిపో మేనేజరుకు ప్రశంసాపత్రం అందచేశారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా డీసీటీవో రాఘవకుమార్ పాల్గొన్నారు. డిపో మేనేజరుకు పలువురు అభినందనలు తెలిపారు.